క్లుప్తంగా

22న ఉగాది కవి సమ్మేళనం

ఆల్విన్‌కాలనీ: వివేకానంద నగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 22వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆలయ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి సీతారామారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమ్మేళనానికి కవి పుంగవులు, సాహిత్యాభిమానులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి

కూకట్‌పల్లి: ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షలో పీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ రాక్షస పాలనకు ఓ నిరుద్యోగి బలయ్యాడని, రాత్రింబవళ్లు కష్టపడి గ్రూప్1కు ప్రిపేరైన సిరిసిల్లకు చెందిన నవీన్‌కుమార్ లీకేజీ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురై చనిపోయాడని, కేసీఆర్‌పై హత్య కేసు పెట్టాలని, నవీన్ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత ఆత్మస్థైర్యం కోల్పోకుండా పోరాటం చేయాలని, కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

పవర్‌నగర్ సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: నూతనంగా ఎన్నికైన పవర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆహ్వానం మేరకు కార్యవర్గ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, సీహెచ్. ప్రభాకర్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పవర్‌నగర్ కాలనీలోని సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, పాల్గొన్నారు.

లైన్‌మెన్ మృతికి ఎమ్మెల్యే సంతాపం


లైన్‌మెన్ నర్సింగ్ (ఫైల్)

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్ నగర్‌లో శనివారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ శాఖ లైన్‌మెన్ నర్సింగ్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం దురదృష్టకరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. నర్సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవటం చాలా బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దేవేందర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు


దేవేందర్‌గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న శేరిలింగంపల్లి నాయకులు

ఆల్విన్‌కాలనీ: మాజీ హోంమంత్రి తుళ్ల దేవేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు పాల్గొని ఆయనతో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ నాయకులు ఏకాంత్ గౌడ్, మూల అనిల్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, నాగుల్ గౌడ్, మాణిక్, శ్రీధర్‌గౌడ్, రవిగౌడ్,, విజయేందర్, జగదీష్ గౌడ్, రత్నకుమార్ తదితరులు పాల్గొని దేవేందర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు.

పెరిగిన పీహెచ్‌డీ ఫీజులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ఫీజులను భారీగా పెంచారు. ఇంతవరకు ఏటా రూ.రెండు వేల ఉన్న ఫీజును ఆర్ట్స్, సోషల్‌సైన్స్ కోర్సులకు ఏటా రూ.20 వేలు ఐదేళ్లకు రూ.1,20,000 కాగా సైన్స్, ఇంజినీరింగ్ కోర్సులకు ఏడాదికి రూ.25 వేలు, ఐదేళ్లకు రూ.1,45,000 పెంచారు. గతంలో పీజీ కోర్సుల ఫీజులను పెంచిన వర్సిటీ అధికారులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల ఫీజులను సైతం పెంచనున్నట్లు సమాచారం.

రోడ్డు పనులు చేపట్టేదెప్పుడు?

- సమస్యల వలయంలో మహంకాళినగర్ కాలనీ
- అభివృద్ధి పనుల పేరుతో రోడ్ల తవ్వకాలు
- పనులు పూర్తయినా నిర్మాణానికి నోచుకోని రహదారి




మహంకాళినగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్విన రోడ్డు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో ఏడాదిన్నర క్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును తవ్వారు. పనులు పూర్తి అయినా తిరిగి రోడ్డు నిర్మించకపోవటంతో ఆ రోడ్డుపైనే కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే ప్రజా ప్రతినిధులు రోడ్డు తవ్వి డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అసలే ఇరుకైన రోడ్డు. రోడ్డు మధ్యలో డ్రైనేజీ


మహంకాళినగర్ కాలనీలోని నాలా పేరుకు పోయిన చెత్తా చెదారం

కోసం రోడ్డును తవ్వి వదిలివేశారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయటంతో వాహనాల రాకపోకలు, పాదాచారులకు ఇబ్బందులు తప్పటం లేదు.

- రోడ్డు మధ్యలో కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు కాలనీలో ఉన్న నాలా ద్వారా మురుగు సైతం రోడ్డుపై పారటంతో అనేక సమస్యలను వారిని మరింతగా వేధిస్తున్నాయి. తమ కాలనీలో ఉన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా ఆయా సమస్యలను పరిష్కరించటంలో అధికారులు విఫలమవుతున్నారు.
- వీధుల్లో అపరిశుభ్రత చోటుచేసుకొని దోమలు, ఈగలు ఆవాసాలుగా మారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి కాలనీ మధ్యలో ఉన్న నాలాలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మోకాలు లోతు నీటిలోనే నడుచుకుంటూ వారు ఇళ్లలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నాలా పొంగిపొర్లిన సమయంలో మురుగు రోడ్లపై చేరటంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఉషాముళ్లపూడి రహదారిపై నుంచే ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. ఈ రహదారికి ఆనుకొని ఉన్న తమ కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ కాలనీపై దృష్టి సారించి కాలనీలో ఉన్న సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అద్దంలాంటి రోడ్డును తొవ్వారు



డ్రైనేజీ పైపులైన్ కోసం ఏడాదిన్నర కిందట అద్దంలా ఉన్న రోడ్డును తవ్వారు. డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికి తిరిగి నిర్మించడం లేదు. రోడ్డు మధ్యలో తవ్వటం వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. నడవటానికి కూడా ఇబ్బందులు తప్పటం లేదు. దీనికి తోడు కాలనీలో ఉన్న ఏ చిన్నపాటి వర్షం కురిసినా నాలా నుంచి మురుగు, వర్షపునీరు రోడ్లపై చేరుతోంది.

– బాలాజీ, మహంకాళినగర్

రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు


కూలిన చెట్లను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఓల్డ్ బోయిన్‌పల్లి: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం పడడంతో కాలనీలు, బస్తీల్లోని చెట్లు విరిగిపడడంతో ప్రజలు ఆందోళన చెందారు. ఆర్ఆర్‌నగర్ రోడ్డు నంబర్ 9, సమతానగర్ ప్రాంతాల్లో భారీ వృక్షాలు విరిగిపడడంతో వచ్చిన శబ్దాలకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వృక్షాలు విరిగిపడిన విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడకు వచ్చి వాటిని తొలగించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నేలకూలిన వృక్షాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఐడీపీఎల్ ఉద్యోగులకు అండగా ఉంటాం


ఐడీపీఎల్ ఉద్యోగులతో సమావేశమైన ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందగౌడ్



కూకట్‌పల్లి: ఐడీపీఎల్ ఉద్యోగుల ఇళ్లను ఖాళీ చేయమని కేంద్ర ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీ చేసిన సందర్భంగా వారు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌లను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆదివారం ఐడీపీఎల్ ఉద్యోగులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ... 40 సంవత్సరాలుగా నివసిస్తున్న ఉద్యోగులను ఖాళీ చేయించటం బాధాకరమని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలుస్తామని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఐడీపీఎల్ కంపెనీ దేశానికి సంపదనిచ్చిందని ఎమ్మెల్యే వివేకానంద గుర్తు చేశారు. ప్రభుత్వ భూములు, కంపెనీలను అమ్మకానికి పెట్టి నమ్ముకున్న ఉద్యోగులను రోడ్డు మీద పడేస్తున్న బీజేపీ ప్రభుత్వం ఏనాడు ప్రజల పక్షాల ఆలోచించలేదన్నారు. అభివృద్ధి చేసే నాయకులపై ఈడీ కేసులు, కేంద్ర ప్రభుత్వ రంగాలతో దాడులు చేసి బెదిరించే ధోరణితో కేంద్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తూ పరిపాలన సాగిస్తుందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఐడీపీఎల్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మేఘరాజు, రమాకాంత్‌కు డాక్టరేట్





డాక్టరేట్ ప్రదానం చేస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మాథెమెటిక్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న పి.మేఘరాజు జేఎన్‌టీయుహెచ్ గణితంలో పీహెచ్‌డీ థీసెస్ సమర్పించారు. ఈనెల 13న డాక్టరేట్ పొందడానికి అర్హత సాధించారు. 'న్యూమరికల్ స్టడీ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆన్ ఎంహెచ్‌డీ ఫ్లో ప్రాబ్లమ్స్ విత్ మాల్ ఎఫెక్ట్'అనే అంశంపై డాక్టర్ శివారెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం జేఎన్‌టీయూలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

కూకట్‌పల్లి: మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన సీఎస్ఈ ప్రొ.రవికాంత్ మామిడికి డాక్టరేట్ వచ్చింది. ఆయన 'ఏ నోవెల్ అప్రోచెస్ ఫర్ మల్టిపుల్ రికార్డ్ మ్యాచింగ్ అండ్ డీఅప్లికేషన్ డేటా ప్రాసెస్ యూజింగ్ రఫ్ సెట్స్'అనే అంశంపై గైడ్‌గా డాక్టర్ డి. వసుమతి వద్ద పరిశోధన చేశారు. దీనిని గుర్తించి జేఎన్‌టీయూహెచ్ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

'మనలో ఐక్యతను చూసి పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి'


మున్నూరు కాపు సమావేశంలో పాల్గొన్న మున్నూరుకాపు సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ జలకన్య సర్కిల్‌లోని మన్నే రామకృష్ణయ్య పటేల్ నివాసంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నిరంజన్ పటేల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్, జీహెచ్‌ఎంసీ కన్వీనర్ చింతపంటి భూమయ్య, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల వీరస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ బీసీ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ తేళ్ల హరికృష్ణ మన్నే రామకృష్ణయ్య పటేల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ... మనలో ఐక్యత పెరిగినందువల్లే ప్రస్తుత రాజకీయ పార్టీలు కాపు సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇవ్వటం మొదలు పెట్టాయన్నారు. మనలో ఇంకా ఐక్యతను చాటుకోవటం అవసరమన్నారు. ప్రస్తుతం బీసీ సామాజికవర్గంలో కాపులు పెద్దన్న పాత్రను పోషిస్తోందన్నారు. ఆ పాత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. మన సామాజిక వర్గానికి విద్యా, వైద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సామాజిక న్యాయం కోసం, ముందు తరాల భవిష్యత్ కోసం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నిజాంపేట్: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసేవాలాల్ మహరాజ్ ఆలయం, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ బంజారా సేవా సంఘం సభ్యులు మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె కార్పొరేషన్ పరిధిలో స్థలం కేటాయించడంతో పాటు నిధులు విడుదల చేసి భవన నిర్మాణాలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షులు రాంచంద్ర నాయక్, రవీందర్ నాయక్, కోశాధికారి పాండునాయక్, రవినాయక్, సంఘ సభ్యులు గోపాల్‌నాయక్, సంతోష్‌నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవాలి


విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఐపీఎస్ అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి సునీల్ ఇమ్మానుయేల్, విశిష్ట అతిథిగా బ్రాడ్రిడ్జ్ సంస్థ మానవ వనరుల ఎగ్జిక్యూటీవ్ వైస్‌ప్రెసిడెంట్ అంకిత్ అరోరాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మొమెంటోలను అందజేశారు. అనంతరం అంకిత్ అరోరా మాట్లాడుతూ.... విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ స్కిల్ సెట్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. సునీల్ మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప గోల్స్ ఏర్పర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుని దేశ ఉన్నతికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంధ్యాల నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జ్యార్గే, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ తాన్య పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

సనత్‌నగర్: నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడే కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, కేంద్రం, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డలో ఆదివారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న టీఆర్ఎస్ సర్కార్‌కు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే తమ కష్టాలు దూరమవుతాయని ప్రజలందరూ విశ్వసిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రాంపటేల్, విఠల్, మల్లికార్జున్, మహ్మద్ షంషీద్దీన్, హాజీటోచర్, ఐవాన్‌వాజ్, జాన్, కలీమ్, నజీర్, సుభాన్, మహేష్, షరీఫ్, రఫీక్, రమాదేవి, రియాజ్, ఆబేదాబేగం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్యకీర్తనలు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాచార్య ఆరాధన సందర్భంగా ఆదివారం గరికపాటి నరసింహారావుకి ధర్మబోధ కేసరి బిరుదు పురస్కారం అందించారు. డాక్టర్ శోభరాజు శిష్యులు పాడిన అన్నమయ్య కీర్తనలకు డాక్టర్ గరికపాటి నరసింహరావు వ్యాఖ్యానం అందించారు. 520వ అన్నమయ్య వర్ధంతి సందర్భంగా శిష్యులు అన్నమయ్యకీర్తనలను పాడి సందర్శకులను అలరించారు. వీరికి వాయిద్య సహకారాన్ని గురుప్రసాద్, కీబోర్డు జయకుమార్ ఆచార్యలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

దుండిగల్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డీపోచంపల్లిలోని ఇందిరనగర్‌కు చెందిన నగేష్, యాదగిరి ముదిరాజ్, శంకర్, శేఖర్ తదితరులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొలన్ హన్మంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలి

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ వ్యవహారంపై టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం కుత్బుల్లాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ కుంభకోణంతో 30 లక్షల మంది నిరుద్యోగులు తమ విలువైన సమయాన్ని కోల్పోయారని అన్నారు. అందుకు కారణమైన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ను వెంటనే విధుల నుంచి తప్పించాలన్నారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలన్నారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, తులసినగర్, సాయినగర్‌ఫ రాఘవేంద్ర నగర్ కాలనీల్లో ముంపునకు గురైన ప్రాంతాలను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలందరు ఇళ్ల, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కు కోసం వినియోగించాలని సంబంధిత అధికారులతో చర్చించారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టిని, నాలాలోని పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు.

ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు కేవలం రాజకీయ లబ్ధి కోసం వాట్సాప్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు అవాస్తవమని ప్రజలకు కూడా అర్థమయ్యేలా దీటైన సమాధానాలతో తిప్పికొట్టాలని సాయికిరణ్‌యాదవ్ పేర్కొన్నారు.

ఏషియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు రవిసింగ్ బిడ్లాన్ ఎంపిక

సనత్‌నగర్: ఏషియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి సనత్‌నగర్ వాల్మీకి వ్యాయామశాల కు చెందిన రవిసింగ్ బిడ్లాన్ ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రంలో మే 1 నుంచి 6 వరకు జరిగే పోటీలకు ఆసియా వ్యాప్తంగా 12 దేశాలు పాల్గొంటాయి. ఈ చాంపియన్‌షిప్‌లో రవిసింగ్ బిడ్లాన్ 105 కేజీల విభాగంలో తలపడనున్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస్‌నగర్ లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. కార్పొరేటర్ జగన్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పేద, మధ్య తరగతి వారికి ఎంతగానో ఉపయోగ పడుతాయని అన్నారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన కేర్‌అండ్‌క్యూర్ ఆస్పత్రి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తాత్కాలిక నియామకాలపై విధించిన నిషేధాన్ని తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలలో పర్మినెంట్ అధ్యాపకుల నియామకం కోసం రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటును చేసి గవర్నర్ సంతకం కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. దీంతో నియామక ప్రక్రియాలలో జాప్యం జరుగుతుంది. ఇది లా ఉండగా గవర్నర్ సంతకం పెట్టే వరకు తాత్కాలిక, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులను నియమించకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవోను జారీ చేసింది. దీంతో వర్సిటీలో నియామకాలు పూర్తిగా నిలిచిపోయి బోధన, ఇతర విధులకు తీవ్రమైన అధ్యాపకుల కొరత ఏర్పడి పనుల్లో జాప్యం జరుగుతుంది. తాత్కాలిక నియామకాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని విద్యార్థి నేతలు డిమండ్ చేస్తున్నారు.

ఉద్యోగ నియామకాల్లో అడ్డగోలు అవినీతి


ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్రంలో పాలన అధ్వానంగా మారిందని... ఉద్యోగులకు రాష్ట్రంలో సరైన న్యాయం జరగటం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జెరిపేట జైపాల్ పేర్కొన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మండల పరిధిలో టీపీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీకి నిరసనగా మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఉద్యోగ నియామకాలు అపహాస్యంగా పరిణమించాయని విమర్శించారు. ఉద్యోగ నియామకాల్లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని ఆరోపించారు. డబ్బులకు ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇంటర్ పరీక్ష పత్రాలు, సింగరేణి పత్రాల లీక్, ఎస్సై, కానిస్టేబుల్స్ పరీక్షల్లో అవకతవకలు, గ్రూప్-1 పత్రాలు లీక్‌తో ప్రభుత్వ పనితీరు ఏంటో ప్రజలకు అర్థమవుతోందన్నారు. వెంటనే మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని... దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.